# నిలువు గీతలు

- శ్రీలత

అతను వస్తున్నాడు. అతను వస్తున్నాడని తెలిసినప్పటి నుండీ ఒకటే కంగారు పడుతూంది స్పర్శ! అతను చాలాసార్లు వచ్చాడు. అయితే ఇప్పుడు కాదు స్టూడెంట్‌గా ఉన్నపుడు, తనూ అతనూ క్లాస్‌మేట్స్‌గా ఉన్నపుడు. ఇద్దరూ కలిసి సబ్జెక్ట్స్ డిస్కస్ చేసుకొనేవాళ్లు.

ఎన్నో ఆలోచనలూ, అభిప్రాయాలు మాట్లాడుకునేవారు. ఎన్నోసార్లు ఏదో ఒక విషయం మీద రాజీకొచ్చేవారు కాదు. కానీ మామూలుగా ఉండేవారు.

ఏనాడూ ఒకరికొకరు ప్రేమిస్తున్నామని చెప్పుకోలేదు. అతను ప్రేమిస్తున్నాడో, లేదో! తను ముందుగా చెబితే ఒకవేళ అతను కాదంటే గుండె పగిలిపోతుంది అని తను.

"ఎంతో మధురంగా సాగే స్నేహం ప్రేమ పేరుతో కలుషితం అవుతుందేమో! తీరా తను చెప్పాక ఆమె కాదంటే" అని అతను అలాగే ఆగిపోయారు. ఎవరికివాళ్లు మనసులో కొంత చోటు ఎదుటివాళ్లకు అట్టిపెట్టి.

కాలం త్రాచుపాములా అలా సాగిపోయింది. ఇద్దరూ జీవితాలలో ఇరుక్కుపోయారు.

పెళ్లయ్యాక ఒక్కసారే వచ్చాడు. తన భర్త చనిపోయినపుడు చంటి పిల్లలిద్దర్నీ ఒళ్లో పెట్టుకుని తను ఏడుస్తున్నపుడు, ఒంటరిదాన్నయిపోయానే అని కుళ్లిపోతున్నపుడు. అతనికింకా పెళ్లి కాలేదపుడు.

"మనం పెళ్లిచేసుకుందాం" అన్నాడతను. పిల్లలవైపు క్వశ్చన్‌మార్కులా చూసింది.

"నేను చూసుకుంటాను. వాళ్లతోబాటుగానే నిన్ను పెళ్లి చేసుకుంటాను" అన్నాడతను.

ఒప్పుకోలేకపోయింది తను. ఎందుకు? అతని మీద ప్రేమ లేదా అంటే బోలెడంత ఉంది. ఆ ప్రేమే అతన్ని పెళ్లి చేసుకోనివ్వలేదు. "అతను తనలాంటి ఓడిపోయిన జీవితాన్ని పంచుకోకూడదు. కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలి" అని మనసు అభ్యంతరం చెప్పింది. తనూ అతనికి అదే సమాధానం చెప్పింది. అతను చిన్నబుచ్చుకుని వెళ్లిపోయాడు.

మళ్లీ ఇన్నాళ్లకు వస్తున్నానని ఉత్తరం రాశాడు. ఇంచుమించు ఐదారు సంవత్సరాల తర్వాత! ఈమధ్యలో అతనికి పెళ్లయినట్లు వెడ్డింగ్ కార్డు చెప్పింది. తనలో ఏ స్పందనా కలగలేదు సంతోషంగానీ, బాధ కానీ. కానీ అతని పెళ్లిరోజు చాలా అనీజీగా శరీరభాగాల్లో ఏదో పోయినట్లు దిగులుగా అనిపించింది. ఆ తరువాత జీవితంలో మళ్లీ మామూలు మనిషయ్యింది.

ఇన్నాళ్లకు "నేను వస్తున్నానన్నట్లు" అతని నుండి టెలిగ్రాం... అతనొచ్చేది రేపే. అందుకే కంగారుగా ఉంది.

ఇల్లంతా నీట్‌గా సర్దింది ఉన్నంతలో. పిల్లలిద్దరికీ ఆ రోజు వేయాల్సిన కొత్త బట్టలు తీసిపెట్టింది. అతనికి ఇష్టమని పాయసం, పులిహోర చేద్దామనుకుంది.

ఇరుగూపొరుగూ "ఏవిటీ హడావిడి?" అనడిగితే "ఈ ప్రపంచంలో నాకున్న ఒకే ఒక మనిషి రేపు ఇంటికి వస్తున్నాడని" చెప్పింది. పిల్లలిద్దరికీ అతను రాగానే ఎలా విష్ చెయ్యాలి, అడిగిన వాటికి ఎలా సమాధానం చెప్పాలి అనేది నేర్పించేసింది.

చూస్తుంటే నిన్న తెల్లవారి రేపును ఈ రోజును చేసింది. అతను రానే వచ్చాడు. టిఫిన్ చేయించి పిల్లల్ని స్కూలుకు పంపేసి అతనికి టిఫిన్ పెట్టి కాఫీ ఇచ్చి, అప్పుడు తీరిగ్గా అతని ముందు కూర్చుంది.

"ఏవిటి విశేషాలు?" అంది.

"ఎందుకలా చిక్కిపోయావు?" అడిగాడు ఆమెవైపే దీక్షగా చూస్తూ.

"చిక్కిపోలేదు, సన్నబడ్డాను" అంది స్పర్శ.

"దానికీ, దీనికీ తేడా ఏమిటి?" అన్నాడతను.

"చాలా" అంది. ఇక ఊరుకున్నాడు.

"పిల్లలు, మీ ఆవిడా బాగున్నారా?" అంది గోళ్లు చూసుకుంటూ.

"ఊ" అన్నాడతను.

"ఈ ఊరికి ఏదయినా పనిమీద వస్తూ ఇక్కడికి వచ్చావా?" అంది మామూలుగానే.

"వేరే పనంటూ ఏమీ లేదు. నిన్ను చూడ్డానికే వచ్చాను" అన్నాడతను ఆమెవైపే చూస్తూ.

"ఏవిటి ఇన్నాళ్లకు నన్ను చూడాలనిపించే విశేషం" అంది. ఏ పనీ లేకుండా తనను చూడ్డానికి వచ్చిన ఆనందంతో.

"మరేం లేదు! ఈమధ్య మన క్లాస్‌మేట్ కిరణ్ కలిసి చెప్పాడు– నువ్వు పిల్లలిద్దరి చదువూ ఇల్లు గడపడంలో ఆర్థికంగా బాధపడుతున్నావని. నీకు అండగా నీవాళ్లెవరూ లేరని..." ఆగిపోయాడు.

"లేరని...?" అంది పూర్తిచెయ్యమన్నట్లుగా.

"నిన్నూ, పిల్లల్నీ నాతో తీసుకెళ్దామని" అన్నాడు. అది తన డెసిషన్, ఆమె కాదనదు అనే కాన్ఫిడెన్స్‌తో.

"తీసుకెళ్లి...?" అంది.

"నేను ఆర్థికంగా బాగానే బలపడ్డాను. నిన్నూ, పిల్లల్నీ చూసుకోగలను".

"నన్నూ, నా పిల్లల్నీ చూసుకోవడానికి నువ్వు మాకేమవుతావు?" అంది.

"ఏదీ కానా?" అన్నాడు ఆమె కళ్లలోకి చూస్తూ. అప్పటికే అవి చెమ్మగిల్లి ఉన్నాయి.

"నేను నీకేమీ కానా? మనస్ఫూర్తిగా చెప్పు" అన్నాడు సూటిగా కళ్లల్లోకి చూస్తూ.

"ఏమౌతావో నేనూ చెప్పలేను కానీ నీ కోరిక సబబు కాదు" అంది.

"ఏం నీకావాత్రం అండగా నేను ఉండకూడదా?" అన్నాడు చిరుకోపంతో.

"నువ్వలా అనుకోవడంలో నా మీద అభిమానం ఉంది కానీ, నాకు నీ మీద అభిమానం ఉన్నట్లయితే నేను నీతో రాకూడదు".

"ఏం సమాజానికి భయపడుతున్నావా? పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన పడుతున్నావా?" సూటిగానే అడిగేశాడు అతను.

"అవి రెండూ కూడా అభ్యంతరానికి తగిన అంశాలే అయినా, అంతకంటే మరో కారణం దాగుంది అభ్యంతరానికి" అంది మెల్లగా.

"ఏవిటో తెలుసుకోవచ్చా" తనేదో పరాయివాడిగా అనిపించసాగింది అతనికి.

"డెఫినెట్‌గా! నువ్వంత ప్రేమగా నన్ను తీసుకెళ్లి జీవితం మొత్తం రిస్క్ తీసుకుని నాకూ, పిల్లలకూ అండగా ఉంటాననడం నీ సహృదయం! నా పట్ల నీకున్న ఆప్యాయత! నా జీవితం పట్ల నీకున్న ఆందోళన! అలాగే నీ పట్ల కూడా నాకు ఉపకారం ఉన్నా నేనూ నిన్నంతగా అభిమానించేదాన్నయితే నేను నీతో కలిసి వచ్చి నీ జీవితానికి రిస్కనివ్వకూడదు. నువ్వెక్కడున్నా బాగున్నావనే భావన ముందు నాతో వుండి అనవసరపు అడ్డంకుల్ని ఎదురుపడాల్సిన సందర్భాలుండడం నాకు పరమ వేదన. కనుక నీ కోసం నేను నీతో రాకూడదు" అంది.

"అంతేనా తుది నిర్ణయం! అంతే అయితే నేను నిన్ను మరిచిపోయే ప్రయత్నం చేసి తీరాలి" అన్నాడు అలా అయినా ఒప్పుకుంటుందేమోనని.

మెత్తగా నవ్వింది. "నీకు ఏది ఆనందాన్నిస్తే అది చేసుకో. కానీ నేను నీ ఆనందాన్ని చెడగొట్టకుండా ఉంచాలంటే నీకు దూరంగా ఉండడమే మేలు. కొన్ని జీవితాలు వంకర్లు తిరక్కుండా ఉండాలంటే కొన్ని జీవితాలు కోల్పోవాలి" అంది తన ఆఖరి నిర్ణయంగా.

"వెళ్లొస్తానయితే" అన్నాడు కినుకగా.

"తప్పకుండా ఒక నేస్తంగా, ఒక శ్రేయోభిలాషిగా, ఒక ఆత్మీయుడుగా నా ఇంట్లోకి రావడమే కాదు నా గుండెల్లో ఎప్పటికీ నిలిచే వుంటావు" అంది.

బ్రీఫ్‌కేస్ తీసి కొంత డబ్బు ఇవ్వబోయాడు.

"వద్దు! నీ ఆత్మీయతకు నేను వెలకట్టలేను. పాలవంటి మన స్నేహంలో విషపు చుక్కలు వేయవద్దు. ఇది నేను దాటవలసిన సాగరం. నా కోసం నువ్వు ఈదే అవసరం ఉండకూడదు" అంది.

నీళ్లు నిండిన కళ్లతో అతను తిరుగుముఖం పట్టాడు. ఎన్నో బంధాలు తనను అలుముకుని తనతో వస్తున్నట్లుగా ఫీలయ్యాడు.

"అంతే! కొన్ని జీవితాలు నిలువు గీతల్లా కలిసి ప్రయాణిస్తాయి, కానీ కలిసిపోవు" అనుకున్నాడు. ❑